రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లుఅం దజేస్తున్న జడ్జి రాజేశ్‌బాబు

యువకులు రక్తదానానికి ముందుకు రావాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజేశ్‌బాబు

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 16: రక్తదానం ప్రాణదానంతో సమానమని, యువకులు రక్తదానానికి ముందుకు రావాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజేశ్‌బాబు అన్నారు. శుక్రవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని జిల్లా జడ్జి ప్రారంభించారు. ఇటీవల ప్రభుత్వ జనరల్ దవాఖాన, మెడికల్ కళాశాల సందర్శనలో జిల్లాలో రక్తనిల్వలు చాలా తక్కువగా ఉన్నాయని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వెల్లడించారన్నారు. అందుకు అనుగుణంగానే న్యాయస్థానంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటివరకు జిల్లా కోర్టులో రక్తదాన శిబిరాన్ని ఎవరూ నిర్వహించలేదని, తమ ఆధ్వర్యంలో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఆరు నెలకు ఒకసారి శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి సీనియర్ సివిల్ న్యాయమూర్తి సబిత మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న వ్యక్తులను కాపాడటమే కాకుండా తమ వయస్సును తగ్గించుకున్న వారమవుతామన్నారు. ఈ సందర్భంగా శిబిరంలో 45 యూనిట్ల రక్తాన్ని సేకరించి, దవాఖాన బ్లడ్‌బ్యాంక్‌కు అందజేశారు. రక్తదానం చేసిన వారికి జడ్జి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు మౌనిక, మమతారెడ్డి, శ్రీనిధి, బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌రావు, కార్యదర్శి పర్వత్‌రెడ్డి, సూపరింటెండెంట్ రఘు, డాక్టర్ రోహిత్, డిప్యూటీ డీఎంహెచ్‌వో వెంకటదాస్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా రథసప్తమి వేడుకలు

అచ్చంపేట రూరల్, ఫిబ్రవరి 16 : మండలంలోని అంకిరోనిపల్లిలో శుక్రవారం రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామశివారులోని దేవరబండ వద్ద వేంకటేశ్వరస్వామి ఆలయంలో పద్మావతి అలివేలుమంగ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి రథోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అమ్రాబాద్ జెడ్పీటీసీ అనురాధ హాజరై స్వామివారికి పూజలు చేశారు. అనంతరం నూతన వెంకటేశ్వరాలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు.

తాడూరులో..

తాడూరు, ఫిబ్రవరి 16: మండలంలోని భలాన్‌పల్లిలోని సూర్యనారాయణస్వామి ఆలయంలో స్వామి కల్యాణోత్సవాన్ని అర్చకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.అంతకుముందు ఆయనను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు.

కల్వకుర్తిలో..

కల్వకుర్తి రూరల్, ఫిబ్రవరి 16 : మండలంలోని మార్చాల, ఎంగంపల్లి, గుండూరు, రఘుపతిపేట, తోటపల్లి గ్రామాల తోపాటు ఆయా గ్రామాల్లో శుక్రవారం భక్తులు, మహిళలు భక్తిశ్రద్ధలతో రథసప్తమి ఘనంగా నిర్వహించారు. అనంతరం దేవతా మూర్తులకు పూజలు చేశారు.

బల్మూరులో..

బల్మూరు, ఫిబ్రవరి 16: మండలంలో అనంతవరం, బల్మూరు, గోదల్, తుమ్మెన్‌పేట, జినుకుంట, మహదేవపూర్, కొండనాగుల, మైలారం, బాణాల, పోలిశెట్టిపల్లి తదితర గ్రామాల్లో శుక్రవారం రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

దివ్యాంగుల దినోత్సవం అధికారికంగా నిర్వహించాలి

అచ్చంపేటటౌన్, ఫిబ్రవరి 16: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక ఇండియా జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ అన్నారు. శుక్రవారం పట్టణంలో దివ్యాంగుల కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబర్ 3న ప్రపంచ వికలాంగుల వినోత్సవం, జనవరి 4 లూయీ బ్రెయిలీ జయంతిని అధికారికంగా నిర్వహించకుండా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ అన్ని జిల్లాల్లో దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారని, నాగర్‌కర్నూల్ జిల్లాలో నిర్వహించకుండా అధికారులు తమను అవమాన పరిచారని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు దేవేందర్, శంకర్, జిల్లా కోశాధికారి రఘునందన్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 16: మండలంలోని వెన్నచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని వస్రీన్‌బేగం కబడ్డీ పోటీలకు ఎంపికైందని ఫిజకల్ డైరెక్టర్ వినయ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. ఈనెల 11న కల్వకుర్తిలో జరిగిన సబ్ జూనియర్ పోటీల్లో విద్యార్థిని వస్రీన్‌బేగం ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని, సూర్యాపేట జిల్లాలో ఈనెల 16, 18 తేదీల్లో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ఎంపీపీ ప్రతాప్‌గౌడ్, సర్పంచ్ రాధా బాలస్వామి, ఎంపీటీసీ రవికుమార్, హెచ్ఎం రాజశేఖర్‌రావు అభినందించారు.

పట్టుదలతో చదివి ఉన్నతస్థాయికి ఎదగాలి

విద్యార్థులకుబ హుమతులుఅం దజేస్తున్న డీఈవో

తెలకపల్లి, ఫిబ్రవరి 16: విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని డీఈవో గోవిందరాజులు అన్నారు. శుక్రవారం మండలంలోని గౌరెడ్డిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల స్వయంపాలన వేడుకకు డీఈవో హాజరయ్యారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలు బోధించిన తీరును డీఈవో అభినందించారు. కార్యక్రమంలో ఏఎంవో షర్ఫొద్దీన్, హెచ్ఎం మల్లికార్జున్, ఉపాధ్యాయులు లక్ష్మీనర్సింహారెడ్డి, వెంకటేశ్, తేజ్యా, శివప్రసాద్ పాల్గొన్నారు.

అక్కారంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ

అచ్చంపేట రూరల్, ఫిబ్రవరి 16: మండలంలోని అక్కారంలో పబ్బతి ఆంజనేయస్వామి ఆలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమం మూడు రోజులుగా కొనసాగుతున్నది. శుక్రవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేశారు. స్వామి వారికి ప్రథమ పూజ, పూర్ణాహుతి, నిర్వహించినట్లు నిర్వాహకులు ఇస్లావత్ రమేశ్, రవి, వసురాంనాయక్, రాజేశ్‌నాయక్, మూర్తి తెలిపారు. ఆలయం నుంచి విగ్రహాలతో శోభాయాత్ర నిర్వహించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
MOGULANNA S/o **DHARMANNA**, House No. 4-33-1, Garlapadu Villege, Dharoor Mandal, Jogulamba Gadwal Dist, I have changed my name as **MADAN**

WANTED
★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-319440-All

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794

కదం తొక్కిన కార్మికలోకం

- సీఐటీయూ ఆధ్వర్యంలో పాత కలెక్టరేట్ ఎదుట నిరసన
- నాగర్‌కర్నూల్ బస్టాండ్ సెంటర్‌లో మానవహారం

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 16: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై కార్మిక నేతలు ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టారు. దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో పాత కలెక్టరేట్ ఎదురుగా శుక్రవారం సమ్మె నిర్వహించారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేసి నిరసన వ్యక్తం చేశారు. సమ్మె సందర్భంగా ఉభయ కమ్యూనిస్టు పార్టీల నాయకులు, కార్మిక సంఘాల నేతలు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందని, దీనివల్ల కార్మికుల పరిస్థితి మరింత దిగజారుతున్నదన్నారు. నల్లచట్టాలు, లేబర్ కోడ్‌ల రద్దు పేరుతో అటు రైతాంగాన్ని, ఇటు కార్మికవర్గాన్ని విచ్ఛిన్నం చేయడానికి మోదీ ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. రోజువారి కూలిని 175 రూపాయలుగా నిర్ణయించడం కార్మికుల కష్టాన్ని పెట్టుబడుదారులకు తాకట్టు పెట్టడమే అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక రైతు, ప్రజావ్యతిరేక విధానాలు వీడక పోతే రాబోయే రోజుల్లో మోదీ ప్రభుత్వానికి పతనం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకులు ఆనంద్‌జీ, జిల్లా కార్యదర్శి పర్వతాలు, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, శివశంకర్, ఏసయ్య, వెంకటయ్య, రైతుసంఘం నాయకులు శ్రీనివాసులు, నర్సింహ, ఐద్వా జిల్లా కార్యదర్శి గీత, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రామయ్య, కోశాధికారి అశోక్, సహాయ కార్యదర్శి లక్ష్మీపతి, శ్రీనివాసులు, కృష్ణాజీ, మురళి, సుగుణ, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు లక్ష్మీనారాయణ శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, ధర్మయ్య, సుమలత, వరలక్ష్మి, పాల్గొన్నారు.

సమ్మె ప్రశాంతం

కోడేరు, ఫిబ్రవరి 16: దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను మండలకేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఢిల్లీలో రైతులు చేస్తున్న ఉద్యమానికి సంఘీభావంగా భారత గ్రామీణ బంద్ చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ రైతులు, కూలీలు, యువకులు పాల్గొన్నారు.

వ్యతిరేక విధానాలను తిప్పికొట్టండి

అచ్చంపేట టౌన్, ఫిబ్రవరి 16: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్త సమ్మెలో భాగంగా అచ్చంపేటలో ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తాలో నిరసన, రాస్తారోకో చేపట్టారు. ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలో సభ నిర్వహించారు. సభలో సీపీఎం కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొమ్మిదేండ్లలో మోదీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాసిందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక రైతు ప్రజా వ్యతికేక విధానాలను రాబోయే రోజుల్లో మోడి ప్రభుత్వానికి పతనం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దేశనాయక్ మద్దతుగా మాట్లాడారు. గిరిజన సంఘం జిల్లా అధ్యక్షురాలు నిర్మల, అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధా న కార్యదర్శి పార్వతమ్మ, నాయకులు సృజన, స్వప్న భారతి, మంజుల, దేవెన, జయప్రద, కృష్ణవేణి, ఆశ వర్కర్ యూనియన్ నాయకురాలు రజిత, నిర్మల, లక్ష్మి, కల్పన, భారతి, సుశీల, గ్రామ పంచాయతీ యూనియన్ నా యకులు నిరంజన్, కొండయ్య, శంకర్, బాలస్వామి, మున్సిపల్ నాయకులు గంగన్న, సాయిలు, శంకర్ తులసి ఆర్టీసీ యూనియన్ నాయకులు, పాల్గొన్నారు.

కార్మికుల ర్యాలీ

కొల్లాపూర్, ఫిబ్రవరి 16: దేశవ్యాప్త కార్మికుల సమ్మెలో భాగంగా శుక్రవారం కొల్లాపూర్ పట్టణంలో రైతు సంఘం, సీఐటీయూ కార్మికులు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోకి వచ్చి పదేండ్లు పూర్తి కావచ్చినా కార్మికవర్గాల సమస్యలను పరిష్కరించడంలో మోదీ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్, నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్‌లో అంబేద్కర్ చౌరస్తాలోని రసనతె లుపుతున్నకా ర్మికులు

కొల్లాపూర్‌లో ర్యాలీని ర్వహిస్తున్నసీ ఐటీయూ న్యాయకులు

కోడేరులో సమ్మెలో మాట్లాడుతున్నన రసింహ

పునరావాసాన్ని ఓ మోడల్‌గా తీర్చిదిద్దాలి

- సార్లపల్లి గ్రామ తరలింపును త్వరగా చేపట్టాలి
- ప్రతి కుటుంబానికి 5 ఎకరాలు
- అటవీ ప్రాంతం నుంచి వెళ్లనున్న 186 కుటుంబాలు
- సమీక్షలో కలెక్టర్ ఉదయ్‌కుమార్

సమావేశంలో మాట్లాడుతున్నకలె క్టర్ఉ దయ్‌కుమార్

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 16: అమ్రాబాద్ టైగర్ రిజర్వు ప్రాంతంలోని సార్లపల్లి గ్రామ తరలింపు ప్రక్రియకు ఎలాంటి ఒత్తిడి లేకుండా గ్రామసభలో తీర్మానించి, సుముఖతం వ్యక్తం చేసిన 186 కుటుంబాల పునరావాసాన్ని నిర్ణీత షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్, సీతారామారావు, జిల్లా అటవీ శాఖాధికారి రోహిత్‌గోపిడి, వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుని పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రస్తుతం గ్రామ తరలింపు పురోగతి పనులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. సార్లపల్లిలో 186 కుటుంబాలను గుర్తించగా, అందులో 85 కుటుంబాలు రూ.15 లక్షల పరిహారం తీసుకోనున్నట్లు వారు గ్రామసభలో వెల్లడించారని, మిగిలిన 101 కుటుంబాలకు బాకారం సమీపంలో ఒక్కో కుటుంబానికి 220 గజాల ఇంటి నిర్మాణానికి స్థలం కేటాయింపు, వ్యవసాయ జీవనోపాధికై ప్రతి కుటుంబానికి 5ఎకరాల వ్యవసాయ భూమిని ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇంటి స్థలం కోసం కేటాయించిన ప్రాంతాభివృద్ధికి కావాల్సిన నిధులు అటవీ శాఖ వద్ద ఉన్నాయన్నారు. సీసీ రోడ్లు, తాగునీరు, విద్యుత్‌సౌకర్యం, అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాల, గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రక్షిత అటవీ ప్రాంతాలు, పులుల ఆవాసాలను అభివృద్ధి చేయాలని, పెంపుడు జంతువుల ద్వారా తలెత్తే సమస్యలను తగ్గించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు.

నేడు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జన్మదిన వేడుకలు

తిమ్మాజిపేట, ఫిబ్రవరి 16: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జన్మదిన వేడుకలను శనివారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షులు జోగుప్రదీప్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, మాజీ సర్పంచ్‌లు, కార్యకర్తలు విధిగా హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

ఎంవీఐగా అశోక్‌కుమార్

కల్వకుర్తి, ఫిబ్రవరి 16 : కల్వకుర్తి ఎంవీఐ (మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్)గా అశోక్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఎంవీఐగా పనిచేసిన రాంబాబు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో అశోక్‌కుమార్ వచ్చారు. తిరుమలగిరి నుంచి వచ్చిన అశోక్‌కుమార్ శుక్రవారం కల్వకుర్తి రోడ్డు రవాణ శాఖ ప్రాంతీయ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు.

బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ కమిషనర్

కొల్లాపూర్, ఫిబ్రవరి 16: కొల్లాపూర్ మున్సిపల్ కమిషనర్‌గా శ్రీనివాసన్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. వికారాబాద్ జిల్లా పరిగి మున్సిపల్ కార్యాలయం నుంచి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాసన్‌కు కార్యాలయం అధికారులు బొకే అందజేసి స్వాగతం పలికారు.

ముళ్లకంప తొలగింపు

కోడేరు, ఫిబ్రవరి 16: మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలో దట్టంగా పెరిగిన ముళ్లకంపను కోడేరు యువజన సంఘం నాయకులు శుక్రవారం తొలగించారు. కొంతకాలంగా పాఠశాల ఆవరణలో కంపతోపాటు పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో విషపురుగుల సంచారం ఎక్కువగా కాగా విద్యార్థులు ఉపాధ్యాయులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో యువజనసంఘం స్పందించి తొలగించారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యులు ఎండీ అబ్దుల్‌కరీం, మాజీ ఎంపీటీసీ శ్రీనువాసులు, యువజన సంఘం అధ్యక్షుడు సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఉప్పునుంతల,ఫిబ్రవరి16: మండల కేంద్రంలో శుక్రవారం రూ.20 లక్షల వ్యయంతో బీసీ కాలనీల్లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీడీవో, స్పెషల్ ఆఫీసర్ లక్ష్మణ్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో అనంతారెడ్డి, జంగిరెడ్డి, నారాయణరెడ్డి, తిరుపతయ్య, అచ్యుతారెడ్డి పాల్గొన్నారు.

ఫౌండేషన్ సేవలు వినియోగించుకోండి

అమ్రాబాద్, ఫిబ్రవరి 16: ఐసీఐసీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని గ్రామ ప్రత్యేక అధికారి రావూఫ్ అన్నారు. శుక్రవారం 'నీటి వనరులపై ప్రత్యేక దృష్టి' అనే అంశంపై మన్ననూర్‌లో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి భీముడు, వైద్యులు సుధాకర్, హెచ్ఎం సిద్ధార్థ పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసునమోదు

తిమ్మాజిపేట, ఫిబ్రవరి 16: మండలంలోని ఓ గ్రామంలో బాలికను మోసం చేసిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై భాస్కర్‌రెడ్డి తెలిపారు. సదరు బాలిక (16)ను ప్రేమిస్తున్నాని, వెంటపడి లైంగిక దాడికి పాల్పడ్డాడని పేర్కొన్నారు. బాలిక వాంగ్మూలం తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి

కొల్లాపూర్, ఫిబ్రవరి 16: ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం ద్వారా డబ్బులు వస్తున్నట్లయితే ప్రతి రైతు ఈకేవైసీ చేయించుకోవాలని ఏవో నాగరాజు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 22వ తేదీలోపు ఈకేవైసీ అప్‌డేట్ చేయించకపోతే తర్వాత విడుతలో డబ్బులు రావని తెలిపారు. మండలంలో ఇంకా 488 మంది ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కొల్లాపూర్, ఫిబ్రవరి 16: కొల్లాపూర్‌లోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో శనివారం ఉదయం 11గంటలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పంపిణీ చేయనున్నట్లు మంత్రి క్యాంప్ కార్యాలయం ప్రతినిధి పస్పుల నర్సింహ శుక్రవారం ప్రకటనలో తెలిపారు.

పోలీస్ అధికారుల బదిలీలు పూర్తి

కల్వకుర్తి, ఫిబ్రవరి 16 : రెవెన్యూ డివిజన్ రెండు పోలీస్ సర్కిల్ పరిధిలో పోలీస్ అధికారులు బదిలీలు సంపూర్ణమయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం, త్వరలో పార్లమెంట్‌కు ఎన్నికలతో పాటు, రకరకాల కారణాల నేపథ్యంలో డివిజన్ పరిధిలోని డివిజన్ పనిచేస్తున్న పోలీస్ అధికారులకు స్థానచలనం చేశారు. పోలీస్ అధికారుల స్థాన చలనానికి రాజకీయ ప్రమేయం ఉందనే ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల ముందు డీఎస్పీ బాధ్యతలు స్వీకరించిన పార్థసారథి రెండురోజుల క్రితం బదిలీఅయ్యారు. సీఐగా బాధ్యతలు స్వీకరించి న ఆంజనేయులుకు ఎన్నికలు ముగియగా నే బదిలీ తప్పలేదు. ఎస్సై రమేశ్, ఊర్కొండ ఎస్సై లెనిన్, వెల్దండ సీఐ సోమనర్సయ్య, ఎస్సై శ్రీనివాసులు, వంగూర్ ఎస్సై కురుమూర్తి, చారకొండ ఎస్సై రవిలు ఎన్నికలు ముగిసిన నెలన్నర వ్యవధిలో బదిలీ అయ్యారు.

శ్రీశైలంలో మహాకుంభాభిషేకం షురూ

శ్రీశైలం, ఫిబ్రవరి 16: శ్రీశైల మహాకుంభాభిషేక ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. శుక్రవారం దేవాదాయశాఖ మంత్రి సత్యనారాయణ దంపతులు, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చక్రపాణిరెడ్డి, సభ్యులు విరుపాక్షయ్య, విజయలక్ష్మి, కనకదుర్గ ఆధ్వర్యంలో ఈవోపెద్దిరాజు అర్చకస్వాములచే మహాకుంభాభిషేక పూజాకార్యక్రమాలు ప్రారంభించారు. శ్రీశైల జగద్గురు పీఠాధిపతి శ్రీ చెన్నసిద్దరామ పాల్గొన్నారు.

కరెంట్‌పై ప్రజాప్రతినిధుల గరం గరం..

- వాడివేడీగా సర్వసభ్య సమావేశం

బిజినేపల్లి, ఫిబ్రవరి 16: వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. శుక్రవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం వాడివేడీగా జరిగింది. ఈ సందర్భంగా కరెంటు అధికారులను ప్రజాప్రతినిధులు నిలదీశారు. రవాణా శాఖకు సంబంధించి బిజినేపల్లిలోని ఆర్టీసీ బస్టాండ్‌లో తాగునీటి వసతి కల్పించాలని ఎంపీటీసీ విజయ్ కోరగా, రెండువారాల్లో సమస్య పరిష్కరిస్తామన్నారు. ఐసీడీఎస్ శాఖ నుంచి అంగన్‌వాడీల్లో చిన్నపైజు గుడ్లు పెడుతున్నారని, పౌష్టికాహారం సక్రమంగా అందించడంలేదని స్థానిక ఎంపీటీసీ బాలస్వామి సభ దృష్టికి తెచ్చారు. తనిఖీలు నిర్వహించి మెనూ ప్రకారం సరఫరా చేస్తామన్నారు. బిజినేపల్లిలో పర్మినెంట్ డాక్టర్‌ను ఏర్పాటు చేసేలా శాఖాధికారులు చొరవ తీసుకోవాలని ఎంపీటీసీ కోరారు. కార్యాలయానికి వచ్చే ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని మంగనూర్ ఎంపీటీసీ తిరుపతయ్య సభ దృష్టికి తేగా, స్వయంగా తనను కలిస్తే సమస్య పరిష్కస్తానని తాసీల్దార్ శ్రీరాములు తెలిపారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ఎక్సైజ్‌శాఖకు సంబంధించి మాట్లాడుతూ గంజాయిని విచ్చలవిడిగా విక్రయిస్తున్నారని, అరికట్టాలని ఎంపీటీసీ బాలస్వామి అధికారులను కోరారు. సమావేశంలో ఎంపీడీవో కతలప్ప, వైస్ ఎంపీపీ చిన్నారెడ్డి, సూపరింటెండెంట్ కృష్ణయ్య, తాసీల్దార్ శ్రీరాములు ఉన్నారు.

ఘనంగా సామూహిక వ్రతాలు

బిజినేపల్లి, ఫిబ్రవరి 16: మండలంలోని పాలెంలో అలివేలుమంగ సమేత వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం సత్యనారాయణస్వామి వ్రతాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో నిత్యారాధన, ప్రభంద పారాయణం, హోమ బలిహరణ, నివేదన కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు మండలస్థాయి గోవిందనామాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. చైతన్య మహిళా సేవాసమితి ఆధ్వర్యంలో కోలాటం, హరికథ కాలక్షేపం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో చైర్మన్ శేఖర్ రెడ్డి, ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, ఈవో రంగారావు, బాలస్వామి, భక్తులు పాల్గొన్నారు.

కార్గో ద్వారా సమ్మక్కసారలమ్మ ప్రసాదం

నాగర్‌కర్నూల్‌టౌన్, ఫిబ్రవరి 16 : సమ్మక్క సారలమ్మ బంగారు ప్రసాదాన్ని ఆర్టీసీ కార్గో ద్వారా ఇంటింటికీ పంపిణీ చేస్తామని డిపో మేనేజర్ దేవరాజు ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు కార్గో డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రాజ్‌కుమార్ 9154298613ను సంప్రదించాలని కోరారు.

సత్యనారాయణస్వామి వ్రతాలుని ర్వహిస్తున్న దృశ్యం

రామాలయంలో ప్రత్యేక హోమం

నాగర్‌కర్నూల్‌టౌన్, ఫిబ్రవరి16 : జిల్లా కేంద్రం రాంనగర్ కాలనీలో ఉన్న శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకొని సూర్యోదయ సమయంలో భక్తులతో సామూహికంగా సూర్యనారాయణ స్వామి హోమం, సామూహికంగా అభిషేక పూజలు నిర్వహించినట్లు ప్రధాన అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో